సాక్షి
పెద్దపల్లి
సోమవారం ၊ 15 ၊ మే ၊ 2023



మల్లన్నకు పట్నాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పట్నాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/29.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

పోరాటాల గడ్డ.. హిందుత్వ అడ్డా..!

- కరీంనగర్ ప్రజలకు సేవచేయడం పూర్వజన్మ సుకృతం
- ఏక్తాయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- కమలదళంతో కాషాయమయంగా కరీంనగర్



కరీంనగర్‌లో ఏక్తాయాత్రకు హాజరైన నాయకులు, కార్యకర్తలు



గదతో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: 'పోరాటాల కరీంనగర్ గడ్డ బండి సంజయ్‌ది.. హిందుగాళ్లు బొందుగాళ్లన్న వాళ్లను బొందపెట్టిన గడ్డ ఇది.. హిందుత్వ అడ్డా ఇది.. కరీంనగర్ వేదికగా హిందూ సమాజానికి సేవ చేసే అదృష్టం రావడం పూర్వజన్మ సుకృతం.. కరీంనగర్ గడ్డకు రుణపడి ఉంటా..' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం కరీంనగర్ నగరంలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మతో కలిసి హిందూ ఏక్తా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మీరంతా ఆశీర్వదించండి... తెలంగాణ మొత్తం హిందుత్వ వాతావరణం తీసుకొచ్చేందుకు పోరాడుతానని అన్నారు. బాలగంగాధర్ తిలక్ హిందువులను సంఘటితం చేసేందుకు వినాయక ఉత్సవాలను ఎలా నిర్వహించారో.. అదే స్ఫూర్తితో తెలంగాణలో హిందువులందరినీ సంఘటితం చేసి రామరాజ్యం స్థాపించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని స్పష్టం చేశారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్ద జరిగిన పాదయాత్ర ఎంతటి సంచలనం సృష్టించిందో.. కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తాయాత్ర అంతటి సంచలనం సృష్టించిందనడానికి ఇక్కడికి వచ్చిన విశేష జనమే నిదర్శనమన్నారు.



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు





ఏక్తాయాత్రకు హాజరైన మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు

కాషాయమయమైన కరీంనగర్...

హిందూ ఏక్తాయాత్రతో కరీంనగర్ కాషాయమయమైంది. భారీగా కాషాయదండు కదిలిరావడంతో నగర వీధులు కిక్కిరిసిపోయాయి. మహిళల డప్పు వాయిద్యాలు, భారీ హనుమంతుడి విగ్రహాలు, విభిన్న వేషధారణలు, విభిన్న సంస్కృతి, సంప్రదాయ వస్త్రధారణలతో హిందూ ఏక్తాయాత్రలో పాల్గొన్నారు. మహిళల మంగళహారతులు.. జైశ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణలతో కరీంనగర్ మారుమోగింది. శ్రీరామ చంద్రుడి విగ్రహాలు, ప్రత్యేకంగా తయారు చేయించిన హనుమంతుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. భారీ వాహనంపై పడుకున్నట్లు కనిపిస్తూ ఒక చేతిలో రాముడు, మరో చేతిలో సీతమ్మవారి విగ్రహాలతో తయారు చేసిన హనుమంతుని విగ్రహం హైలైట్‌గా నిలిచింది. భక్తి పాటలు.. ధార్మిక ప్రసంగాలు.. హైందవ గొప్పతనాన్ని చాటేలా ఊరేగింపులతో ఏక్తాయాత్ర నయనానందంగా సాగింది.

ఏక్తాయాత్ర సాగింది ఇలా..

హిందూ ఏక్తాయాత్ర వైశ్య భవన్ నుండి ప్రారంభమై.. రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్, శాస్త్రీరోడ్, భారత్ థియేటర్, కమాన్ చౌరస్తా, బస్టాండ్, తెలంగాణ చౌక్, ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ రోడ్ మీదుగా తిరిగి వైశ్యాభవన్‌కు చేరుకుంది. మూడు రోజుల ముందు నుంచే నగరం మొత్తం కాషాయజండాలతో అలంకరించారు. కాషాయజెండాలతో నగర వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ యాత్రకు భారీ ఎత్తున జనం తరలిరావడంతో హిందుత్వ సైనికులతో కరీంనగర్ మొత్తం కాషాయమయమైంది.

అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం

- న్యూఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: నాలుగు సిద్ధాంతాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే న్యూ ఇండియా పార్టీ లక్ష్యమని జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ వేముల పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్పయాత్ర ఆదివారం గోదావరిఖనికి చేరింది. ఈ సందర్భంగా స్థానిక స్నేహసాహితీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ మాట్లాడారు. పౌర సత్వబంధు ద్వారా ఆధార్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి నెలకు రూ.5వేలు, కుటుంబ బంధు ద్వారా ప్రతీ కుటుంబానికి రూ.12లక్షలు ఇచ్చి వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతీ గ్రామానికి ఏటా రూ.5 కోట్లు కేటాయించి ఆ గ్రామంలో మౌలిక సదుపాయాలతోపాటు పారిశ్రామికంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సమాజాభివృద్ధి చెందే పథకాలు ప్రవేశపెడతామన్నారు. వ్యవసాయబంధు ద్వారా ప్రతీ ఎకరాకు ఏటా రూ.12వేలు ఇస్తూ ఐదెకరాలకు తక్కువగా ఉన్న ప్రతీ కుటుంబానికి రూ.60వేలు ఇస్తామన్నారు. భూమిలేని ప్రతీ కుటుంబానికి సైతం రూ.60వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు జేవీ రాజు, నాయకులు జనగామ తిరుపతి, ఉపాధ్యక్షులు జనగామ లక్ష్మీనారాయణ, గంట బబిత, గోపాల్, వెంకటేశ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కోలిండియా డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న జీఎంలు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో డైరెక్టర్‌గా పనిచేసి పదోన్నతిపై కోలిండియా టెక్నికల్ డైరెక్టర్‌గా ఎంపికైన తర్వాత మొదటిసారి గోదావరిఖనికి వచ్చిన బి.వీరారెడ్డిని ఆదివారం సన్మానించారు. ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో బసచేసిన వీరారెడ్డిని ఆర్జీ–1, 2 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎ.మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

హక్కుల కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని(రామగుండం): ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికుల చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాటం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంత నిరుద్యోగుల నుంచి పర్మినెంట్ ఉద్యోగం, చట్టబద్ధ సౌకర్యాలు, సంక్షేమం, పని భద్రత ఉంటుందని ప్రలోభపెట్టి ఒక్కొక్కరి నుంచి భారీగా వసూలు చేశారన్నారు. ఉద్యోగం కోసం డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు నిరాశకు గురికావద్దని, ధైర్యంగా పోరాడుదామన్నారు. కె.రాజన్న, ఐద శ్రావణ్, నరేశ్, రాంకీ, రవీందర్, మధుకర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ కోరారు. జంగాలపల్లిలో కొనసాగుతున్న భూపోరాట కేంద్రాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. రెండు నెలలుగా రామగుండం కార్పొరేషన్‌లో భూపోరాటం నడుస్తుందన్నారు. వేలాది మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, వీరికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, నాయకులు ఎరవెల్లి ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, నాగమణి, ఫైముద, పీర్‌మహ్మద్, సురేశ్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతిపై దరఖాస్తుల ఉద్యమం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ధర్మారం(పెద్దపల్లి): గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతిపై దరఖాస్తుల ఉద్యమం చేపట్టినట్లు ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు గుమ్మడి కుమారస్వామి తెలిపారు. ధర్మారంలో ఆదివారం ప్రజాహిత పోస్టర్‌ను విడుదల చేశారు. కుమారస్వామి మాట్లాడుతూ రుణమాఫీ, నిరుద్యోగ భృతిపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రాష్ట్ర గవర్నర్, సీఎం, జిల్లా కలెక్టర్లకు, ప్రజాప్రతినిధులకు పంపిస్తామన్నారు. తమ ఉద్యమానికి పార్టీలకతీతంగా మద్దతు చేయాలని కోరారు. కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి, పవన్‌కుమార్, వంగ లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ సరిహద్దు పారామిలటరీ బలగాల ఆధ్వర్యంలో డ్రోన్ బాంబులు, వైమానిక దాడులు నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు పెద్దపల్లిలో ఈనెల 20న నిర్వహించే బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కుమారస్వామి, రాజగోపాల్, వినోద్, లక్ష్మణ్, వెంకట్, సంపత్, కొంరయ్య, రవీందర్, సుదర్శన్ పాల్గొన్నారు.



కాషాయమయం

- నేత్రపర్వంగా హనుమాన్ జయంతి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- జనసంద్రమైన కొండగట్టు అంజన్న సన్నిధి
- సుమారు రెండు లక్షల మంది రాక
- ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు



మల్యాల(చొప్పదండి): ఎటు చూసినా భక్తజనం.. ఏ మూలన విన్నా జై బోలో హనుమాన్ నామస్మరణం.. ఓ చోటుకు వెళ్లినా కాషాయ రంగు దుస్తులు ధరించిన స్వాములు.. ఏ నోట విన్నా దీక్ష చేపట్టిన స్వాముల భజనలు.. వెరసి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధి భక్తజన సంద్రంగా మారింది. హనుమాన్ పెద్దజయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, దీక్షస్వాములు, మాలధారులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలైన్ల ద్వారా ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ముడుపులు చెల్లించుకున్నారు. మాల, దీక్ష విరమించారు. తలనీలాలు సమర్పించుకున్నారు. ఈనెల 12న ప్రారంభమైన ఉత్సవాలు.. ఆదివారం పెద్దజయంతి వేడుకలతో ముగిశాయి. రెండ్రోజులపాటు సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు సుమారు లక్ష మంది దీక్ష, మాలధారులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్ ఉత్సవాలను పర్యవేక్షించారు. ఆదివారం శ్రీఆంజనేయస్వామి మూలవిరాట్టును లక్ష నాగవల్లి దళాలతో అలంకరించారు. అనంతరం అర్చన నిర్వహించారు. 11 రకాల భోగాలతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జితేంద్రస్వామి, ఉపప్రధాన అర్చకుడు చిరంజీవి, స్థానాచార్యులు కపేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.



ఇరుముళ్లతో వస్తున్న మాలధారులు



ఆలయ ఆవరణలో ఇరుముళ్లు



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తుడు

అమ్మకు వందనం

గోదావరిఖని(రామగుండం): అమ్మ.. రెండు అక్షరాల పదం.. సృష్టికి మూలం అమ్మ. పిల్లల కోసం తన జీవితాన్నే త్యాగం చేసే మాతృమూర్తులకు ఎంత చేసిన తక్కువే. గర్భంలో నవమాసాలు మోసినప్పటి నుంచి బిడ్డకు జన్మనిచ్చి..పెంచి..పెద్ద చేసిన తల్లి రుణం తీర్చుకునేందుకు గోదావరిఖనిలో పాదపూజోత్సవం నిర్వహించారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం తల్లి రుణం తీర్చుకునేందుకు పాదపూజ చేశారు. ఈ వేడుకకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 2023 మంది తల్లులకు పాదాభిషేకం చేశారు.

పెద్దకొడుకులా నేనుంటా..

ఈ ప్రాంత ప్రజలకు పెద్ద కొడుకుగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జవహర్‌లాల్ స్టేడియంలో 2023 మంది తల్లులకు మాతృపూజోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే తన తల్లి పాదాలకు అభిషేకం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన తల్లులకు వెండి నాణేలు బహూకరించారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మూల విజయారెడ్డి, కెంగర్ల మల్లయ్య, అడ్డాల స్వరూప పాల్గొన్నారు.



తల్లికి పాదపూజ చేస్తున్న ఎమ్మెల్యే చందర్



కార్యక్రమానికి హాజరైన తల్లులు

తల్లిని ఎప్పటికీ గుర్తుంచుకోవాలి



మాతృదినోత్సవం రోజున పూజించడమే కాకుండా ఎల్లకాలం తల్లిని గౌరవించాలి. పాదపూజోత్సవానికి హాజరుకావడం ఇది మూడోసారి. తల్లికి పాదపూజ చేయడం గర్వంగా ఉంది. బిడ్డ కోసం జీవితాన్ని త్యాగం చేస్తున్న తల్లికి ఎంత చేసిన తక్కువే.

– శ్రీపల్లి దీక్షిత, గోదావరిఖని

సంతోషంగా ఉంది



తల్లిగా పాదాభిషేకం జరగడం మర్చిపోలేకపోతున్నా. ఈరోజు ఇక్కడ అమ్మకు ఇచ్చిన గౌరవం ఎప్పటికీ ఇలానే ఉండాలి. చాలా సంతోషంగా ఉంది. మారుమూల గ్రామం నుంచి వచ్చినప్పటికీ ఈ కార్యక్రమం చూసి చాలా సంతోషంగా ఉంది.

– కందుగుల భూదమ్మ, మద్రిపల్లి, అంతర్గాం

బది'లీలలు'

- పోలీస్ పోస్టింగ్‌లలో ప్రైవేట్ వ్యక్తి పెత్తనం
- కమిషనరేట్ వదలని కొందరు అధికారులు
- ఎన్నికల వేళ అధికారపార్టీ నేతల ఇష్టారాజ్యం
- అనుకూలమైన సీఐలు, ఎస్ఐలపై దృష్టి

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కేంద్రీకృతమైన ఒక పోలీస్‌స్టేషన్‌కు గత నెలలో ఓ ఎస్సై బదిలీపై వచ్చారు. అయితే సదరు ఎస్సై తనకు అనుకూలంగా లేదని, మరో ఎస్సైకు సిఫారుసు లెటర్ ఇచ్చారు ఎమ్మెల్యే. దీంతో నెలరోజులు తిరగకముందే మరో పోలీస్‌స్టేషన్‌కు పోవాల్సి వచ్చింది. సిఫారసు లెటర్‌తోపాటు నేతలకు మచ్చికగా ఉండక తప్పని పరిస్థితి నెలకొందనడానికి ఇదే నిదర్శనం.



సాక్షి, పెద్దపల్లి: ఇటీవల జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీలు చేపట్టారు. ఇవి అంతర్గత బదిలీలు అనిపిస్తున్నా రాజకీయనేతల కనుసన్నల్లోనే బదిలీలు జరిగినట్లు సొంత శాఖలోనే చర్చ జోరందుకుంది. కమిషనరేట్ పరిధిలోని పోలీసుశాఖలో పదోన్నతులు, బదిలీలకు వేచి చూస్తున్న పలువురు సీఐలు, ఎస్సైలు తాము కోరుకున్న పోస్టింగ్‌ల కోసం ఓ ప్రైవేట్ వ్యక్తి ద్వారా భారీగా లాబీయింగ్ కొనసాగిస్తున్నారని చర్చ సొంత శాఖలో జోరుగా సాగుతోంది. సదరు వ్యక్తిని కలిస్తేనే ఇటు నేతలను, మరోపక్క పోలీస్ ఉన్నతాధికారులను 'మేనేజ్' చేస్తాడనే వాదన పోలీసుల్లో వినిపిస్తోంది. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ జిల్లాలో కొందరు నేతల ప్రమేయం లేకుండానే చేసినట్లు చర్చ సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమకు అనుకూలమైన అధికారులను బదిలీ చేయించుకునే దిశగా నాయకులు పావులు కదుపుతున్నారు. ఇటీవల జరిగిన 11 మంది ఎస్సైల బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఏడాది చివరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఎన్నికల్లో కీలకమైన రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసుశాఖల్లో అనుకూలమైన సిబ్బంది నియామకం దిశగా అధికార పార్టీ నేతలు దృష్టి సారించారు. తాము సూచించిన అధికారులనే ఆయా స్థానాల్లో నియమించాలనే ఒత్తిడి ఉన్నతాధికారులపై అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా ఓ ప్రైవేట్ వ్యక్తి చక్రం తిప్పి నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పించినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

పోస్టింగ్ ప్లేస్‌ను బట్టి డిమాండ్

జిల్లాలోని సింగిల్ పోలీసుస్టేషన్లకు, సర్కిల్ కార్యాలయాలకు పోలీసుశాఖలో మంచి డిమాండే ఉంది. సదరు పోలీసుస్టేషన్, సీఐ పోస్టింగ్ కోసం కొందరు ఎస్ఐ, సీఐలు భారీగా ఖర్చు పెట్టేందుకు వెనుకాడడం లేదు. గతంలో డిమాండ్ ఉన్న పీఎస్‌కు కొందరు ఎస్ఐలు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు ముట్టజెప్పారనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో జాతీయ రహదారి వెంట, మానేరు తీరం వెంబడి, భూముల విలువలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్లకు మంచి డిమాండ్ ఉండడంతో ఇక్కడ పోస్టింగ్ పొందేందుకు పలువురు ఎస్ఐలు, సీఐలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిభ ఆధారంగా కాకుండా లూప్‌లైన్‌లో ఉన్నవారు అలాగే ఉంటూ, రామగుండం కమిషనరేట్ పరిధి దాటకుండా ఇక్కడిక్కడే తిరుగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

నేతల చుట్టూ ప్రదక్షిణలు

ఎమ్మెల్యేల సిఫారసుతోనే బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు తమ శాఖ ఉన్నతాధికారుల చుట్టూ తిరగడం కంటే ఎమ్మెల్యేలను మచ్చిక చేసుకుంటున్నారు. గతంలో రెండేళ్ల పీరియడ్ పూర్తి చేసుకున్న తర్వాత తమ పనితీరు, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణపై ఎలా దృష్టి సారించామో అధికారులకు వివరిస్తూ మంచి పోస్టింగ్ ఇవ్వాలని అభ్యర్థించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులకు భిన్నంగా మారిపోయి తమ పలుకుబడి ఎంత 'బలంగా' ఉంటే అంత మంచి పోస్టింగ్ వస్తుందని పోలీసు విభాగంలో బాహాటంగానే చర్చ ఉంది. పనితీరుకు ప్రామాణికత లేకుండా పోయిందని గుర్తించిన సిబ్బంది ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉండేందుకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఏ స్టేషన్ పోలీస్ అధికారి పీరియడ్ దగ్గర పడుతుందో లెక్కలేసుకుంటూ అక్కడ తమ బెర్త్ ఖాయం చేసుకునేందుకు అడ్వాన్స్ బుకింగ్ కూడా చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. రామగుండం కమిషనరేట్‌కు ఐపీఎస్ వచ్చిన బదిలీల్లో మార్పు రావడం లేదని, పోలీస్ పోస్టింగ్ వ్యవహారంలో నేతల జోక్యంతో అధికారులు నేతల మచ్చికకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

నేడు తెలుకుంటకు మంత్రి కొప్పుల ఈశ్వర్

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని తెలుకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఎంపీపీ రమాదేవి తెలిపారు. ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ భానుప్రసాద రావు, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితోపాటు స్థానిక నాయకులు పాల్గొంటారన్నారు. మండలంలోని బీఆర్ఎస్ అభిమానులు, నాయకులు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్ ఆలయంలో 'సోమారపు' పూజలు


పూజలు చేస్తున్న సత్యనారాయణ

గోదావరిఖనిటౌన్(రామగుండం): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ఆర్టీసీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ రామగుండం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పిడుగు కృష్ణ, నాయకులు దాసరి కిశోర్, గాండ్ల స్వరూప, మామిడి వీరేశం, అందె రాజ్‌కుమార్, ప్రశాంత్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ ఎస్సైగా విజేందర్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ ఎస్సైగా విజేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ఉపేందర్‌రావు జైపూర్‌కు బదిలీ కాగా దేవాపూర్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన విజేందర్ బదిలీపై సుల్తానాబాద్‌కు వచ్చారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై విజేందర్

వేసవి శిబిరం.. చిన్నారుల సంబరం

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులు
- అధిక సంఖ్యలో హాజరవుతున్న పిల్లలు
- ఆటపాటలతో సందడి సందడిగా మైదానాలు, బాలభవన్‌లు


కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్: సమ్మర్ హాలీడేస్ వచ్చాయంటే ఆటపాటల సందడే సందడి.. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చిన్నారులు అక్కడ చేరుతారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండుతున్నా తగ్గేదే లేదంటూ ఉదయం నుంచి రాత్రి వరకు టీవీ, ఫోన్లు, ఆటలపాటలతో ఎంజాయ్ చేస్తున్నారు. నలుగురు కలిస్తే క్రికెట్ ఆడటమే. పలువురు చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి జిమ్‌లకు, వాకింగ్ సెంటర్లకు వెళ్లి, వ్యాయామం చేస్తున్నారు. ఇంకొందరు సమ్మర్ క్యాంపులకు వెళ్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాలపై కథనం.

కరీంనగర్ నగరపాలిక ఆధ్వర్యంలో..

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది 27 క్రీడాంశాల్లో క్యాంపులను అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, తైక్వాండో, జూడో, కరాటే, కిక్‌బాక్సింగ్, స్కేటింగ్, వాటర్ స్పోర్ట్స్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, వుషు, యోగా, నెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ క్రీడల్లో శిక్షణనిస్తున్నారు. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సుమారు 2 వేల మందికి పైగా చిన్నారులు క్యాంపులకు హాజరవుతున్నారు. జూన్ 5 వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయి. ప్రతీ చిన్నారికి పౌష్టికాహారం అందిస్తున్నారు. 10 గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. వాలీబాల్ (రామడుగు, తాడికల్, అక్కన్నరు, మల్లారెడ్డిపల్లి) హాకీ (గుమ్లాపూర్, హుజూరాబాద్) కబడ్డీ (గన్నేరువరం), హ్యాండ్‌బాల్ (రామడుగు), అథ్లెటిక్స్ (వీణవంక), జూడో (నేదునూరు) నేర్పిస్తున్నారు. అంబేడ్కర్ స్టేడియంలోని బాలభవన్ కేంద్రంలో సంగీతం, నృత్యం, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, మృదంగం, టైలరింగ్, ఆర్ట్, క్రాఫ్ట్, మెహందీ, అబాకస్, శాస్త్రీయ నృత్యం, చెస్, యోగాలో ఉచితంగా శిక్షణనిస్తున్నారు.

జగిత్యాల జిల్లాలో..


బాస్కెట్‌బాల్ శిక్షణలో చిన్నారులు

జగిత్యాల మినీ స్టేడియంలో చిన్నారులకు బాస్కెట్‌బాల్ క్రీడలో ఉచిత శిక్షణనిస్తున్నారు. పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు ఈ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చిన్నారులకు స్నాక్స్, గుడ్లు, పండ్లు అందజేస్తున్నారు. జగిత్యాలలో నెల రోజులపాటు శిక్షణ కొనసాగుతుంది.

పెద్దపల్లి జిల్లాలో..


రేగడి మద్దికుంటలో ఖోఖో ఆడుతున్న పిల్లలు

జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో 10 గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 31 వరకు ఇవి కొనసాగుతున్నాయి. ఖోఖో (రాఘవాపూర్, రేగడిమద్దికుంట, వడ్కాపూర్), కబడ్డీ (అప్పన్నపేట), అథ్లెటిక్స్ (కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి), వాలీబాల్ (నందిమేడారం, జూలపల్లి, ఎగ్లాస్‌పూర్), ఫుట్‌బాల్ (అంతర్గాం) శిక్షణనిస్తున్నారు. నిత్యం ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు మైదానాల్లో శిబిరాలు కొనసాగుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..


సిరిసిల్లలో కుంగ్‌ఫూ శిక్షణ

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మాస్టర్ ఒడ్నాల శ్రీనివాస్ శిక్షణనిస్తున్నారు. సిరిసిల్లలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 25 మందికి కబడ్డీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు నా రాయణ తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ శిక్షణ శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. తపవన యోగా కేంద్రం నిర్వాహకుడు ఎలిగేటి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్నారు. సిరిసిల్లలోని ఆర్కే మిత్ర ఫౌండేషన్ స్వరాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతం నేర్పిస్తున్నారు.

బ్యాడ్మింటన్ నేర్చుకుంటున్న



నాకు బ్యాడ్మింటన్ అంటే ఇష్టం. ఈ ఆటలో మంచి ప్లేయర్ కావాలని వేసవి శిక్షణ శిబిరానికి వచ్చి, నేర్చుకుంటున్న. లాస్ట్ ఇయర్ కూడా వచ్చాను. ఇలాంటి ఫ్రీ ట్రైనింగ్ క్యాంపులు రోజూ ఉంటే బాగుంటుంది.

– కె.రిషికేశ్, కరీంనగర్

శిక్షణ శిబిరాలకు స్పందన



వేసవి శిక్షణ శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. తల్లిదండ్రులు పిల్లలను ఏదైనా ఒక క్రీడలో ప్రోత్సహిస్తున్నారు. జూడోకు ఆదరణ ఉంది. గతేడాది ఇదే శిక్షణ శిబిరంలో కోచింగ్ తీసుకున్న పలువురు చిన్నారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

– ఎస్.ప్రియాంక, జూడో కోచ్, కరీంనగర్

బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్‌కు వస్తున్న



జగిత్యాలలో బాస్కెట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇస్తున్నారు. ప్రాక్టీస్ కోసం రెగ్యులర్‌గా వస్తున్న. ఉదయం, సాయంత్రం వార్మప్, ఎక్సర్‌సైజ్‌లు చేశాక బాస్కెట్ బాల్ నేర్పిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. అందరం వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నాం.

– కల్యాణ్‌రామ్, జగిత్యాల

అమ్మ భారమైంది..!

- మాతృ దినోత్సవం రోజు మంటగలిసిన మానవత్వం
- పింఛన్ సొమ్ము, రేషన్ బియ్యంతో బతుకీడుస్తున్న వృద్ధులు
- తల్లిదండ్రులను ఇంట్లోంచి గెంటేసిన తనయుడు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో హృదయ విదారక చర్య
- కుమారుడిని ఇంటి నుంచి వెళ్లాలని కులపెద్దల తీర్మానం

దండం పెట్టి బతిమాలినా కనికరించకపాయే...

'అయ్యా నా కొడుకులు కాటికి కాలుచాపిన మమ్మల్ని పోషించడం లేదని నలుగురికి చెప్పుకుంటే మా పరువే పోతుందని, మనస్సులో పెట్టుకుని బాధలను దిగమింగినం. అయినా కొడుకులు మారకపాయే. రెక్కలు ముక్కలు చేసుకుని బండెడు సంతానాన్ని మోసిన తండ్రి పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్నాడని దండంపెట్టి బతిమాలినా పెద్దకొడుకు కనికరం చూపక కష్టపెడుతుండు..' అని వాపోయింది గంగవ్వ.

చందుర్తి(వేములవాడ): నవ మాసాలు మోసి, కని పెంచి పెద్ద చేసిన తల్లి భారమైంది. వృద్ధురాలైన తల్లికి ఐదుగురు సంతానం. అందులో ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. వీరికి పెళ్లిళ్లై అందరూ స్థిరపడ్డారు. ఇద్దరు కొడుకులు వేరు కావడంతో తల్లిదండ్రులు కట్టించిన ఇంటిని పెద్దకొడుకు కొనుగోలు చేశాడు. ఇందుకు చిన్నకొడుక్కి కొంత నగదు చెల్లించాడు. దీంతో ఇంటిని కొనుగోలు చేసిన పెద్దకొడుకే అదే ఇంట్లో ఉంచి వారి బాగోగులు చూసుకోవాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. వృద్ధులైన తల్లిదండ్రుల పద్ధతులు పెద్దకొడుక్కి నచ్చక ఇంట్లో ఉండకూడదంటూ నిత్యం వేధించసాగాడు. అంతటితో ఆగకుండా మాతృ దినోత్సవం రోజునే తల్లిని ఇంటినుంచి గెంటేసి, మానవత్వ మంటగలిపేలా చేసిన హృదయ విదారకమైన చర్యకు పాల్పడిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేటలో ఆదివారం చోటుచేసుకుంది.


ఇంటి నుంచి గెంటివేశాక పక్షవాతం వచ్చిన భర్త లచ్చయ్య పక్కన కూర్చొని రోదిస్తున్న గంగవ్వ

వృద్ధాప్యమే భారమై ...

లింగంపేటకు చెందిన తర్రె గంగవ్వ–లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు సంతానం. ఆడ పిల్లలకు పెళ్లిచేసి అత్తారింటికి పంపించారు. ఇద్దరు కుమారులకు పెళ్లి కావడంతో ఇద్దరు వేర్వేరుగా కాపురం పెట్టారు. ఆస్తిపంపకంలో భాగంగా తల్లిదండ్రులు కట్టించిన ఇంటిని పెద్దకుమారుడు గంగారాం కొనుగోలు చేసేందుకు చిన్న కుమారుడికి రూ.2.50లక్షలు చెల్లించాడు. ఇంటి పంపకం చేసేటప్పుడు కుల పెద్దలు తల్లిదండ్రులు మరణించే వరకు ఇదే ఇంట్లో ఉంటారని తీర్మానించారు. ఈక్రమంలో గతేడాది తండ్రి లచ్చయ్యకు పక్షవాతం రాగా కదలేని స్థితిలో ఉన్నాడు. తల్లిదండ్రుల పోషణకు ఇద్దరు కుమారులున్నప్పటికీ కన్నతల్లి మాత్రం ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్ సాయంతో పాటు రేషన్ బియ్యంతో కాలం వెళ్లదీస్తున్నారు. అయినా పెద్ద కొడుకు గంగారాం తల్లిదండ్రులను ఇంట్లోంచి వెళ్లగొట్టేందుకు కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఇదే విషయమై గతంలో కులపెద్దలకు తల్లి చెప్పినప్పటికీ గంగారాం వినిపించుకోలేదు. దీంతో ఆ ముసలి తల్లి చందుర్తి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల జోక్యంతో కొంతకాలం మౌనంగా ఉన్న కుమారుడు తిరిగి వేధింపులకు గురిచేస్తున్నాడంటూ శనివారం రాత్రి గ్రామపెద్దలను కలిసింది. విషయం తెలుసుకున్న గంగారం ఆదివారం ఉదయాన్నే తల్లితో గొడవకు దిగి ఇంటిని గెంటేశాడు. దీంతో విషయం తెలుసుకున్న చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దప్పుల అశోక్, కుల సంఘం పెద్దలు తర్రె ఆనందం, నరేశ్, శంకర్, గుడిసె నర్సయ్యతో పాటు సంఘం సభ్యులు గంగారాం ఇంటికి వెళ్లగా అప్పటికే ఇంటినుంచి పారిపోయాడు. దీంతో కులపెద్దలు తల్లిదండ్రులు సంపాదించిన ఇంటి స్థలంలో పెద్దకొడుకు ఇల్లు కట్టుకుని ఉండాలని తీర్మానించారు. అంతేకాకుండా ఇంటికోసం చెల్లించిన రూ.2.50 లక్షల నగదును గంగారాంకు తిరిగి చెల్లించాలని చిన్న కుమారుడు శ్రీనివాస్‌కు తీర్మానించారు. తల్లిదండ్రుల మరణానంతరం ఇల్లు ఇద్దరిపేరిట ఉంటుందని నిర్ణయించారు.

'సెస్' మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి మృతి

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్‌గా సేవలు
- సంతాపం తెలిపిన మంత్రి కేటీఆర్, వినోద్‌కుమార్


లక్ష్మారెడ్డి (ఫైల్)

సిరిసిల్ల: 'సెస్' మాజీ చైర్మన్, ప్రముఖ న్యాయవాది దోర్నాల లక్ష్మారెడ్డి(69) సిరిసిల్లలో ఆదివారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో కన్నుమూశారు. తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన లక్ష్మారెడ్డి కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, సిరిసిల్ల ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అడ్వకేట్‌గా మంచి గుర్తింపు పొందడంతో పాటు 1995లో సిరిసిల్ల రూరల్ జెడ్పీటీసీ సభ్యుడిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్‌గా, క్రిమినల్ లాయర్‌గా, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రెండుసార్లు 'సెస్' చైర్మన్‌గా పనిచేశారు. లక్ష్మారెడ్డికి భార్య సరళ, కొడుకు డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి(డెంటిస్ట్), కూతురు సునంద(కోర్టు ఉద్యోగి) ఉన్నారు. సిరిసిల్లలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, న్యాయవాదులు, వేములవాడ న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ సంతాపం..

లక్ష్మారెడ్డి మృతికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం తెలిపారు. ఆయన 'సెస్' చైర్మన్‌గా చేసిన సేవలను గుర్తుచేశారు. లక్ష్మారెడ్డి పార్థివదేహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ గజభీంకార్ రాజన్న, రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


సారయ్య (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): న్యూమారేడుపాక రెడ్డి కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద బొగ్గు రవాణా చేస్తున్న గూడ్స్ రైలు కిందపడి పురాణం సారయ్య(28) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ మండలంలోని పెంచికల్‌పేటకు చెందిన సారయ్యకు కరీంనగర్‌కు చెందిన రాజేశ్వరితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అతను యైటింక్లయిన్‌కాలనీ, మహాకవి పోతనకాలనీ, కమాన్‌పూర్ తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై తిరుగుతూ స్టీల్ పాత్రలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవ పడుతున్నాడు. ఈ నెల 12న మద్యం మత్తులో భార్యతో గొడవ పడి, కొట్టాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సారయ్య సింగరేణి ఓసీపీ–1 సైలో నుంచి ఎన్టీపీసీకి బొగ్గు రవాణా చేసే గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ రెడ్డి పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లడంతో కొలనూర్‌వాసి..


సురేందర్‌రెడ్డి (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఉప్పరపల్లె లెవెల్ క్రాసింగ్ గేట్–కొత్తపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్యలో ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన ఐరెడ్డి సురేందర్‌రెడ్డి(40) గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం జీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కథనం ప్రకారం.. సురేందర్‌రెడ్డి నిత్యం మద్యం తాగుతుండటంతో భార్యతో విభేదాలు వచ్చాయి. ఆమె నాలుగేళ్ల క్రితం భర్త, ఇద్దరు కొడుకులను వదిలేసి, పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన సురేందర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జాతీయ సాంకేతిక ప్రదర్శనలో విద్యార్థిని ప్రతిభ

- హర్షితను అభినందించిన కేంద్ర మంత్రి


కేంద్ర మంత్రికి ప్రాజెక్టు పనితీరు వివరిస్తున్న హర్షిత

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన జాతీయ సాంకేతిక దినోత్సవంలో జిల్లాకు చెందిన విద్యార్థిని తన ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. రామగిరి మండలంలోని చందనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని హర్షిత తాను తయారు చేసిన బహుళ ప్రయోజన హెల్మెట్‌ను ప్రదర్శించింది. చివరి రోజైన ఆదివారం కేంద్ర సాంకేతికశాఖ మంత్రి జితేందర్‌సింగ్ హర్షిత తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలించి, అభినందించారు. ఈ హెల్మెట్ వెల్డింగ్ చేసేవారికి, కర్రతో మెషిన్ల వద్ద , పొగ వచ్చే ప్రదేశాల్లో పనిచేసే వారికి రక్షణగా ఉంటుందని విద్యార్థిని వివరించింది. హర్షితతోపాటు గైడ్‌టీచర్ సంపత్‌కుమార్‌ను డీఈవో మాధవి, ఎంఈవో సంపత్‌రావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

బస్ డిపో.. కలేనేమో!

- అప్‌గ్రేడ్‌కు నోచుకోని పెద్దపల్లి బస్టాండ్
- జిల్లాలోని చాలా గ్రామాలకు వెళ్లని బస్సులు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ ప్రజల ఇబ్బందులు


పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్

పెద్దపల్లిరూరల్: 'అధ్యక్షా.. పెద్దపల్లి ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపర్చేందుకు వీలుగా బస్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.. జిల్లా కేంద్రంగా ఏర్పడిన పెద్దపల్లిలో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.' అని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇటీవలి శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

అన్ని ప్రధాన పట్టణాల్లో ఉన్నాయి..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో బస్ డిపోలున్నా.. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పెద్దపల్లిలో ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అడగకుండానే జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం ఎంత అడిగినా డిపోను మాత్రం ఇవ్వడం లేదని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో బస్టాండ్‌ను బస్ డిపోగా అప్‌గ్రేడ్ చేస్తామని, జిల్లా కేంద్రంలో అధికారులను నియమిస్తామని చెప్పి, చివరకు చేతులెత్తేశారు.

30 క్రితమే మంజూరైనా..

పెద్దపల్లికి 30 ఏళ్ల క్రితమే బస్‌డిపోను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ స్థల సేకరణ విషయంలో జాప్యం జరగడంతో అప్పటి ఎమ్మెల్యే శ్రీపాదరావు మంథనికి తరలించుకుపోయారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ఎంతగా ప్రయత్నించినా పెద్దపల్లిలో డిపో ఏర్పాటుకు అడుగులు పడటం లేదు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణలు ఆర్టీసీ చైర్మన్లుగా పని చేసినా ప్రభుత్వ నిర్ణయాల మేరకు కొత్త బస్ డిపోల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేకపోయారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు

పెద్దపల్లి పరిసర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు సొంత వాహనాలు లేదంటే ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. పెద్దపల్లి–ధర్మారం, పెద్దపల్లి–కూనారం మినహా మరే ఇతర మార్గాల్లోనూ బస్సులు నడవడం లేదు. పెద్దబొంకూర్, చీకురాయి, గౌరెడ్డిపేట ముత్తారం వంటి పల్లెలకు వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు. ప్రసిద్ధ లక్ష్మీనర్సింహస్వామి ఆలయమున్న దేవునిపల్లికి ఆటోల్లో వెళ్లాల్సిందే. పల్లెలకు పక్కాగా బీటీ రోడ్లు వేయించిన పాలకులు పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటు చేయించి, రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని గ్రామీణులు కోరుతున్నారు.

మా ఊరికి బస్సు రాదు



పెద్దపల్లి నుంచి చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. మా ఊరు గౌరెడ్డిపేటకు బస్సు రాదు. కొన్ని రూట్లలో ప్రారంభించిన వాటిని సరైన ఆదాయం రావడం లేదంటూ రద్దు చేశారు. బస్ డిపో ఏర్పాటు చేసి, అన్ని గ్రామాలకు బస్సులు నడపాలి.

– కొమ్ము సత్యం, గౌరెడ్డిపేట

ప్రభుత్వం స్పందించాలి



పెద్దపల్లి ఆదాయంలో నంబర్ వన్ జిల్లాగా గుర్తింపు పొందింది. అలాంటి జిల్లా కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం సరి కాదు. బస్సులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– సీపెల్లి రవీందర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి